క్లుప్తంగా

స్కేటింగ్ పోటీల్లో సాయిచరణ్ ప్రతిభ


బహుమతితో సాయిచరణ్

పలాస: రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి బొమ్మాళి సాయిచరణ్‌కు జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం లభించింది. శ్రీకాకుళం అరసవల్లి జంక్షన్‌లోని 80 అడుగు రోడ్డులో ఆదివారం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సాయిచరణ్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం స్వాధించడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సాయిచరణ్‌ను స్కూలు ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు కిరణ్, దేవా, కోచ్ చంద్రగోపాల్ అభినందించారు.

రూ. 21 వేలు పలికిన లడ్డూ ప్రసాదం


లడ్డూని సొంతం చేసుకున్న సాయిమణికంఠ

పలాస: కాశీబుగ్గ హరిజన వీధిలో ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన గణేష్ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వినాయకునికి నైవేద్యంగా పెట్టిన లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. సాయి మణికంఠ 21,500 రూపాయలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సీహెచ్ నేతాజీ, వీఆర్వో యు.బైరాగి, యు.అప్పలస్వామి, కోల ఆనంద్, కృష్ణారావు, టొక్క శ్రీను, సురేష్, రాము, భీమరాజు, జయరాం, మోహనరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న యువకులు

కంచిలి: మండలంలోని జాతీయ రహదారి జక్కర గ్రామ కూడలి నుంచి అర్జునాపురం గ్రామం మీదుగా రేఖాదేవిపురం జంక్షన్ వరకు గల రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. చాలా భాగం గోతులమయమై, అందులో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ గోతులను ఆ ప్రాంత మోటారు ఫీల్డ్ యూనియన్ వారు సహకారంతో అర్జునాపురం గ్రామ యువకులు శ్రమదానం చేసి తాత్కాలికంగా క్రషర్ డస్ట్‌తో ఆదివారం పూడ్చిపెట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేయగలిగారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బాడాన పుష్ప

పలాస: సచివాలయం ఉద్యోగులు తమ సేవలను ప్రజలకు సక్రమంగా అందించడంతో పాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని బ్రాహ్మణతర్లా సర్పంచి బాడాన పుష్ప, ఎంపీటీసీ సభ్యురాలు తుంగాన రమణమ్మ కోరారు. బ్రాహ్మణతర్లా పంచాయతీలో సచివాలయం ఉద్యోగులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విరివిగా వర్షాలు కురుస్తున్నందున మంచినీరు కలుషితమై ప్రజలు జ్వరాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని వీధుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, పూర్తి స్థాయిలో ఈక్రాప్ నమోదు చేయాలన్నారు.

కొండ చిలువ కలకలం


గ్రామస్తులు హతమార్చిన కొండచిలువ

టెక్కలి రూరల్: రావివలస గ్రామంలో ఆదివారం సాయంత్రం కొండ చిలువ కలకలం రేపింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఓ ఇంటి వద్ద పిల్లలు ఆడుకుంటుండగా కొండచిలువ కనిపించడంతో భయంతో కేకలు వేశారు. దీంతో సమీపంలో ఉన్నవారు అప్రమత్తమై దాన్ని కర్రలతో కొట్టి చంపడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వంట..తంటా

- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఇబ్బందులు
- మూలనపడిన గ్యాస్ పొయ్యిలు
- ఇరుకు గదుల్లోనే వంట


లొద్దపుట్టి పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు


ఈదుపురం (ఆర్) పాఠశాలలో ఇలా..

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వంట చేయడానికి తంటాలు పడుతున్నారు. వసతుల్లేక నిర్వాహకులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 347 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 704 మంది మధ్యాహ్న భోజనం వంటలు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

కొన్నేళ్ల క్రితం వంట నిర్వహణకు గ్యాస్ పొయ్యిలు మంజూరయ్యాయి. కాగా ఇవి నాసిరకంగా ఉండటంతో పాటు మరమ్మతులకు గురికావడంతో నిర్వాహకులు వినియోగించడం నిలిపివేశారు. దీంతో పాటు గ్యాస్ పొయ్యిలు ఆయా సంఘాల ఏజెన్సీల పేరుతో ఉండటం, ఈ గ్యాస్ పొయ్యిల సబ్సిడీ ఏజెన్సీల ఖాతాలలోకి వెళ్లడంతో నిర్వాహకులు గ్యాస్ పొయ్యిల వినియోగానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆయా పాఠశాలలకు మంజూరైన గ్యాస్ స్టౌలు గదుల్లో మూలుగుతున్నాయి.

ఇబ్బందుల్లో నిర్వాహకులు

గ్యాస్ పొయ్యిలు లేక.. వంట చేయడానికి సరైన గదుల్లేక వంట నిర్వాహకులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో వంట గదుల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. గాలి ఆడని గదుల్లో వంట నిర్వహించడం కత్తిమీద సాములా ఉంటోందని నిర్వాహకులు వాపోతున్నారు. పొగతో నిండి ఉన్న గదుల్లో వంట చేస్తుండటంతో తమ ఆరోగ్యం చెడిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లోని శిథిలమయ్యే గదుల్లో వంట నిర్వహిస్తున్నామని, వంట సామాన్లు ఉంచేందుకు కూడా సరైన వసతి లేదని వాపోతున్నారు. మరోవైపు గ్యాస్ పొయ్యిలు లేక వంట చేయడం కష్టంగా మారిందని అంటున్నారు. కట్టెలతో వంటలు చేస్తున్నామని చెబుతున్నారు. వంట చెరుకు కూడా అధిక ధర పలుకుతోందని మహిళలు తెలిపారు.


బూర్జపాడు పాథమిక పాఠశాలలో కట్టెలపొయ్యిపై వంట చేస్తూ..


ఈదుపురం హైస్కూల్లో రేకుల షెడ్డులో వంట చేసున్న దృశ్యం

సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వంట చెరుకు దొరకడం చాలా కష్టంగా ఉంది. గ్యాస్ సిలిండర్‌లను విడిపించలేక కట్టెలతో వంట చేస్తున్నాం. ప్రభుత్వమే గ్యాస్ స్టౌ, సిలిండర్‌ను సరఫరా చేయాలి. లేని పక్షంలో గ్యాస్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వమే నిర్వాహకులకు నేరుగా అందించాలి.

– గెడెల కోకిల, వంట నిర్వాహకురాలు, ఈదుపురం

భయపెడుతున్న కుక్కలు!

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి వర్తక, వ్యాపార కేంద్రంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. డజన్ల కొద్దీ కుక్కలు పాఠశాలలు, బ్యాంకులు, కళాశాలల వద్ద గుమి గూడి చిన్నారులు, వృద్ధులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గడిచిన ఏడాదిలో 25 మందికి కుక్కలు కరవడంతో వారు ఆస్పత్రుల పాలైయ్యారు. ప్రధానంగా చికెన్, మటన్, చేపల మార్కెట్‌లలో మిగిలిన వ్యర్థాలను పూండిలోని స్టేషన్ రోడ్డు పూండి– నౌపడ రహదరికి ఇరువైపులా పడేయడంతో వాటిని తిన్న కుక్కలు మరింతగా చెలరేగిపోయి హల్ చల్ చేస్తున్నాయి. మాంసం రుచికి అలవాటు పడిన కుక్కలు ఆది, మంగళవారాలు మినహా మిగతా రోజుల్లో ఒంటరిగా వెళుతున్న వారిపై దాడులకు దిగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.


పూండి స్టేట్‌బ్యాంక్ సమీపంలో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు.

బాల్యమిత్రుడికి అండగా..


రాజబాబుకు సాయాన్ని అందజేస్తున్న మిత్రబృందం

కవిటి: బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న రాజబాబు అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు అండగా నిలవాలని భావించారు. 36,100 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆదివారం జగతి గ్రామానికి వెళ్లి రాజబాబుకు అందజేసి ధైర్యం చెప్పారు.

పూర్వవిద్యార్థి ఔదార్యం

కవిటి: తనకు బాల్యంలో అక్షరభిక్ష పెట్టి.. తన అభివృద్ధికి బాటలు వేసిన పాఠశాలకు సీసీ రోడ్డును నిర్మించి పూర్వ విద్యార్థి ఔదార్యాన్ని చాటుకున్నారు. రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల (పీఎం శ్రీస్కూల్)లో ఆర్.భైరిపురం గ్రామానికి చెందిన పిరియా రాజగోపాలరావు, ప్రస్తుత హెచ్‌ఎం శివరాంప్రసాద్‌పాఢి 1982 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేశారు. తమ బ్యాచ్‌మీట్ హెచ్‌ఎం కావడంతో ఇద్దరూ తరచూ మాట్లాడుకునేవారు. ఇదే క్రమంలో స్కూల్ కోసం ఏదైనా చేయాలనే అభిప్రాయాన్ని రాజగోపాలరావు వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మన బడి 'నాడు–నేడు' పథకంలో సర్వాంగ సుందరమైన భవన నిర్మాణం జరిగింది. పాఠశాల మెయిన్ గేట్ నుంచి ఆఫీసు గది వరకు సీసీ రోడ్డు వేస్తే బాగుంటుందన్న మిత్రుల సూచనతో రాజగోపాలరావు ఆలోచన చేశారు. ఆలోచనను ఆచరణలో పెట్టారు. రూ. ఒకలక్ష వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఆదివారం దీన్ని పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారు. పూర్వ విద్యార్థి ఔదార్యాన్ని హెచ్‌ఎం శివరాంప్రసాద్ పాఢి అభినందించారు.


పాఠశాలకు నిర్మించిన సీసీ రోడ్డు

అవయవదాత కుటుంబానికి ఆర్థికసాయం

సంతబొమ్మాళి: గొల్లసీతాపురం గ్రామానికి చెందిన అవయవదాత బొమ్మాళి బాలరాజు కుటుంబానికి దాతలు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న బాలరాజు ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభం పైనుంచి పడిపోయి బ్రెయిన్‌డెడ్‌కు చేరుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యుల ఆమోదంతో అవయవదానం చేసి మరో నలుగురికి ప్రాణం పోశారు. నిరుపేద కుటుంబ కావడంతో మృతుని భార్య, ఏడాది పాపను ఆదుకోవాలని స్థానిక వీఆర్వో కోరాడ రమణబాబు విజ్ఞప్తి మేరకు దాతలు ముందుకొచ్చారు. రూ.59 వేలు సేకరించి మృతునికి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దాతలు కోరాడ రమణబాబు, కుస వెంకటరమణ, అద్దాల మధు, తలగాన రాంబాబు, సతీష్ ఉన్నారు.


సాయాన్ని అందజేస్తున్న దాతలు

తిలక్ పరామర్శ

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో ఇటీవల పలు కుటుంబాలకు చెందిన వ్యక్తులు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం పరామర్శించారు. నందిగాంలో సాక్షి విలేకరి సుధాకర్ తల్లి మృతి చెందడంతో ఆయా కుటుంబాన్ని, బెల్లుకోలలో లైన్‌మెన్ శంకరరావు కుటుంబాన్ని, టెక్కలిలో విలేకరి ఈశ్వరరావు కుటుంబాన్ని, పెద్దలవునిపల్లి గ్రామంలో ఏఎస్‌ఎం బసవల కంచెమ్మ కుటుంబాన్ని, ప్రతాప విశ్వనాథపుర లో వలంటీర్ జయరాం కుటుంబాన్ని తిలక్ పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు చిన్ని జోగారావు, కె.నారాయణమూర్తి, టి.రాజు, బి.తిరుపతిరావు, మదీన్, బి.జోగారావు, ఎ.వాసుదేవరావు, పి.బాబురావు, పి.చంద్రయ్య, జానీ, సోమేశ్వర్రావు ఉన్నారు.


సుధాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిలక్, నాయకులు

పొంచిఉన్న ప్రమాదం

ఇచ్ఛాపురం: పట్టణంలోగల పాత జాతీయ రహదారికి పక్కనే ఉన్న భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి పడిపోయే స్థితిలో ఉంది. దీంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. ఈ వృక్షానికి ఇరువైపులా రెండు బైక్ మెకానిక్ గ్యారేజ్‌లున్నాయి. ఈమార్గం జనసంచారంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఏ క్షణంలోనైనా చెట్టు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణమే చెట్టును తొలగించాలని కోరుతున్నారు.


ఎండిపోయిన చెట్టు

'దేవుడితో రాజకీయ ఆటలొద్దు'


మోహన్‌రావు

టెక్కలి: దేవుడితో రాజకీయ ఆటలాడొద్దని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగుపురం మోహన్‌రావు హితవు పలికారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఇది రాష్ట్రానికి మంచిది కాదన్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని గమనిస్తే దానికి పరీక్షలు నిర్వహించి ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలి తప్పా ఇలా కలియుగ వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ లబ్ధి పొందడానికి దేవుడితో ఆటలాడొద్దని అన్నారు.

అగ్నివీర్‌కు గ్రామీణ యువకుల ఎంపిక


సాయిసూర్య


అరణ్య


సునీల్

కాశీబుగ్గ: అగ్నివీర్ ఉద్యోగానికి గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకులు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన పోతనపల్లి అరణ్య, సైని సునీల్, వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన బదకల సాయిసూర్యలు ఎంపికయ్యారు. వీరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడేళ్ల క్రితం 40 మందితో ఏర్పాటైన కళాశాలలో ప్రస్తుతం 320 మంది విద్యార్థులు చదువుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

అనాథ పిల్లలకు భోజనం వితరణ


పిల్లలకు కౌన్సెలింగ్ చేస్తున్న లయన్స్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ పాపినాయుడు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ డాక్టర్ అన్నెపు సుశీల సేవా కార్యక్రమాలలో భాగంగా అనాథ పిల్లలకు భోజన సౌకర్యాం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురం గ్రామం వద్ద ఉన్న ప్రశాంతి సాయిసేవా ట్రస్ట్‌లోని 96 మంది అనాథ పిల్లలకు భోజనాన్ని ఆదివారం సమకూర్చారు. అలాగే చదువుల్లో రాణించేలా లయన్స్ క్లబ్ సభ్యులు, విశ్రాంత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి తమ్మినాన మాధవరావు, క్లబ్ ట్రెజరర్ నెమలిపురి అప్పారావు, పూర్వ అధ్యక్షులు కొర్రాయి బాలకృష్ణ, సభ్యులు వీరఘట్టం వెంకటరావు, ఉపాధ్యాయులు తమ్మినాన భోజరాజు, కుమారి నీరజ, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

రచయిత తెప్పలకు సత్కారం


సత్కారం పొందుతున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాసకు చెందిన ప్రముఖ రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. అనకాపల్లి పట్టణంలోని గౌరీ గ్రంథాలయం హాల్‌లో సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం జరిగింది. ఇందులో 'మహోన్నతం మన సంస్కృతి' అనే కవితను కృష్ణమూర్తి గానం చేసి ప్రశంసలు పొందారు. ఈయనను శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శాస్త్రీ తదితరులు చేతుల మీదుగా దుశ్శాలువ, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రిట్టపాడు గ్రామంలో వెంకటేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, సేవా సమితి అధ్యక్షులు జి.నిరంజన్, గున్న జయరాం, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన్‌రావు, తామాడ విశ్వనాథం ఉన్నారు.

వేసిన కొద్ది రోజులకే శిథిలం!


విరిగిన శ్లాబ్

ఇచ్ఛాపురం: కాలువపై ఏర్పాటు చేసిన పైకప్పు కొద్దిరోజులకే శిథిలమైంది. దీంతో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని క్రీడా మైదానం..బెల్లుపడ కూడలిలోని కాలువపై కవర్ శ్లాబ్‌ను ఈనెల 12వ తేదీన మున్సిపల్ అధికారులు వేయించారు. పట్టణంలోకి వచ్చేందుకు ఈమార్గమే కీలకం. నిత్యం వందలాది వాహనాలు రాకపోకసాగిస్తుంటాయి. అంతటి ప్రధాన్యం ఉన్న కాలువపై ఇటీవల వేయించిన కవర్‌శ్లాబ్ నాణ్యతా లోపం కారణంగా విరిగిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి విరిగిన శ్లాబ్ స్థానంలో కొత్తది ఏర్పాటుచేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఈదుపురంలో ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం మేజరు పంచాయతీలో ఆదివారం దోమలు నివారణకు ఫాగింగ్ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నీలాపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలువల్లో మురుగును తొలగించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, నేషనల్ యూత్ వలంటీర్ హంగిర్ బెహరా పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

టెక్కలి రూరల్: మండంలోని పలు చోట్ల పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్టు టెక్కలి పోలీసులు ఆదివారం తెలిపారు. భగవాన్‌పురం గ్రామం సమీపంలోని శ్మశానవాటిక వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి ఏడుగురిని అదుపులోకి తీసుకొని వీరివద్ద నుంచి రూ. 2,110 స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్కవరం గ్రామ సమీపంలో ఆరుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.1520 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.